
ఇక సొంతింటి వారమండీ!

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- పలు చోట్ల ఉత్సాహంగా గృహ ప్రవేశాలు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


ధర్మవరం జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు


గృహప్రవేశం జరిగిన ఇల్లు

ప్రత్తిపాడు రూరల్: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన ఏడాదికే దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఆయా స్థలాల్లో గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంటు, స్టీల్ వంటి సామగ్రితో పాటు బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. దీంతో ప్రత్తిపాడు మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేస్తున్నారు.

ఆర్థిక సహకారం..

ఇంటి పట్టాలు పొందిన పేదలకు గృహ నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తక్కువ ధరకు అందజేయడంతో పాటు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల నిధులను ప్రభుత్వం అందజేస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అదనంగా బ్యాంకు రుణం కింద రూ.35,000 చొప్పున మంజూరు చేయడంతో ఉత్సాహంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు.

ప్రత్తిపాడు మండలంలో వివరాలు

ప్రత్తిపాడు మండలంలో 1,669 మందికి గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 647 గృహాలు పూర్తి కాగా బీబీఎల్ 337, బీఎల్ 415, ఆర్ఎల్ 82, ఆర్‌సీ 70 దశల్లో గృహాల నిర్మాణ పనులు ఉన్నాయి.

ప్రత్తిపాడు మండలంలో వివరాలు

మంజూరైన ఇళ్లు	1,669
నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లు	647
బిలో బేస్‌మెంట్ లెవెల్ ఇళ్లు (బీబీఎల్)	337
బేస్‌మెంట్ లెవిల్ ఇళ్లు (బీఎల్)	415
గోడల వరకూ పూర్తయినవి	82
శ్లాబ్ వరకూ పూర్తయినవి	70

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్, బిల్లులు పెండింగ్‌లో లేకుండా అందిస్తున్నాం. 80 శాతం మేరకు నిర్మాణాలు జరిగాయి. మిగిలిన వాటిని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకున్నాం.

–కె.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ, ప్రత్తిపాడు

గృహ ప్రవేశం చేశాం



ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది. అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులు అందించడం కారణంగా త్వరితగతిన ఇంటిని పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేశాం. మా సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– గుండ్ర దుర్గాలక్ష్మి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

నా ఇంటి విలువ రూ.12 లక్షలు



ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో భర్త, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాను. ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. అర్హత కలిగిన నాకు ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు గృహ నిర్మాణ పథకం మంజూరు చేయడంతో ఇంటిని పూర్తి చేసుకున్నాం. ప్రస్తుత నా ఇంటి విలువ రూ. 12 లక్షలకు పైగా చేస్తుంది. ఈ కానుక ఇచ్చిన జగనన్నను ఎన్నటికి మరువలేను.

– కర్రి లక్ష్మి, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం

జగనన్న మేలు మరచిపోలేం



ఆటో నడుపుకుంటూ వచ్చే సొమ్ములతో జీవించే తాము ఇల్లు సమకూర్చుకుంటామని అనుకోలేదు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్ గురించే బెంగ ఉండేది. అందుకే ఇంటిపై ఆశ వదులుకున్నాం. కానీ జగనన్న పుణ్యమా అని ఒమ్మంగి జగనన్న కాలనీలో సొంతిల్లు కట్టుకున్నాం. ఇల్లు పూర్తయిన తరువాత ఇది కలా నిజమా అనే అనుమానం వస్తోంది. జగనన్న మేలు మరచిపోలేం.

– ఊరగంటి సుభాషిణి, ఒమ్మంగి, ప్రత్తిపాడు మండలం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- సూరంపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం


సూరంపాలెంలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సూరంపాలెంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. డ్రైన్లు, రోడ్లు, వీధిదీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. జీజీఎంపీ నిధులు రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీలు మద్దిపట్ల రామకృష్ణ, చెల్లూరి రాంబాబు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఏలేశ్వరంలో గడప గడపకూ మనప్రభుత్వం


ఏలేశ్వరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, కోరాడ రామలక్ష్మీదేవి, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, కోరాడ ప్రసాద్, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్ కుమార్, కాకాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం


తునిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 23వ వార్డు గవరపేట ఆదర్శనగర్ కాలనీ పార్కు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడుతూ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో తుని పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్ కర్రి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: యువత ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై విద్యాసాగర్ సూచించారు. జగ్గంపేట వివేకానంద స్కూల్‌లో శుక్రవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులు, మహిళలు దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వివేకానంద విద్యా సంస్థల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

రౌతులపూడి: వార్డు సభ్యుల ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన పూర్తయినట్టు ఎంపీడీఓ ఎం.గోవింద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఎ.మల్లవరంలో ఐదో వార్డు (జనరల్)కు మంగిన రాజేశ్వరి, జల్దాం ఏడో వార్డు(జనరల్ మహిళ)కు కోసూరి లక్ష్మి ఒక్కొక్క నామినేషన్, ఎం.కొత్తూరు నాల్గో వార్డు (జనరల్ మహిళ)కు వంతు లక్ష్మి, వై.రామలక్ష్మి రెండు నామినేషన్లు వేశారన్నారు. మూడు వార్డులకు నాలుగు నామినేషన్లు రాగా వాటిని పరిశీలించామన్నారు. ఎ.మల్లవరం, జల్దాంలో ఒక్కొక్క నామినేషన్ రావటంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన


కె.సూరంపాలెంలో ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: ఆస్పత్రిని నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని కె.సూరంపాలెంలో నాడు–నేడు నిధులు రూ.2.15 కోట్లతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి ఉపయోగంలోకి వస్తే ఐదు గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు వైద్య నిమిత్తం కాట్రావులపల్లి పీహెచ్‌సీని ఆశ్రయించాల్సి వస్తోందని, ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వారి సమస్యలు తీరుతాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

దేవీచౌక్ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మను వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బంగారు వరలక్ష్మీ కానుక పేరుతో కంబాల శ్రీనివాస్‌రావు దంపతులు 50 మంది మహిళలకు ఒక్కొక్కరికీ గ్రాము బంగారు రూపులను లక్కీ డ్రా ద్వారా ఇవ్వనున్నట్టు ప్రకటించడతో మహిళలు వరలక్ష్మీవ్రతానికి భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కోటనందూరు: సాగు చేసిన వరి, ఇతర పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకునేలా రైతులను ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 10,400 ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితులతో ఇప్పటి వరకూ కేవలం 1050 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయన్నారు. రైతులంతా నారుమడులు తయారు చేసినప్పటికీ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో నాట్లు వేయలేదన్నారు. తాండవ నీరు విడుదల చేయడంతో ఇప్పుడు నాట్లు జోరందుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం పొందాలన్నా..విధిగా ఈ–కాప్ చేయించుకోవాలన్నారు. నీటి ఎద్దడి నేపథ్యంలో రైతులు తాండవనీటిని దుర్వినియోగం చేయకుండా శివారు ప్రాంతాలకు సైతం అందేలా జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ శ్రీనివాసు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, ఏఈఓ కేవీ శివకుమారి, ఏఏబీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు కేంద్రం బాధ్యత వహించాలి

గోకవరం: మణిపూర్ ఘటనకు కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం మణిపూర్ ఘటనకు నిరసిస్తూ సమావేశం నిర్వహించారు. తొలుత ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ మణిపూర్‌లో గత రెండు నెలలుగా హింస, మారణకాండ జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. ఆదివాసీలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. మణిపూర్ అల్లర్లకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో డి.సురేష్, శ్రీకాంత్, గోలి మునలయ్య, గుడిసె అబ్బు, కడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


కోటనందూరు హైస్కూల్లో ఐఎఫ్‌బీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఇంటరాక్టివ్ ఫ్లాట్‌పేనల్ బోర్డు (ఐఎఫ్‌బీ) స్క్రీన్‌ను సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గశ్రీనుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుర్ల రాజు, పెద్దిర్సి రమేష్, ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా నా భూమి-నాదేశం


ఎ.మల్లవరంలో మట్టిని చేతపట్టి నినాదాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం, బీబీ పట్నం, రౌతులపూడి, దిగువశివాడ, బంగారయ్యపేట గ్రామాల్లో శుక్రవారం నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ చేసి ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలను నాటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచులు చిందాడ పెదరాజు, కటారి అర్జునమ్మ, కొరుప్రోలు దేవుడు, మాదాసు దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆధ్వర్యంలో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అమర వీరులు, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఉపాధి ఏపీఓ రాజ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల గోపి, ఈగల శ్రీను, పంపన బోయిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షిద్దాం

తుని రూరల్: ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు అన్నారు. మండలంలోని తేటగుంట, హంసవరం, హెచ్.కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం నాభూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేసి చెరువు గట్లపై కొబ్బరి మొక్కలను నాటారు. సర్పంచులు రాయి మేరీఅవినాష్, అత్తి నాగరాజు, సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శుక్రవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి వర్మ, గాది అయిరాజు, సమ్మిటి ఆదినారాయణ, కోరాడ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి అన్నారు. మండలంలోని జగపతినగరం, తామరాడ, శృంగరాయునిపాలెం, రామచంద్రపురం, పాలెం, గెద్దనాపల్లి, ఎస్.తిమ్మాపురం, వేలంక గ్రామాల్లో శుక్రవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. జాతీయ జెండాలను చేతపట్టి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో శుక్రవారం 'నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు దో చిట్టిబాబు జాతీయ పతాకాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

202 మందికి కంటి పరీక్షలు


వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

తుని: స్థానిక పార్క్ వీధిలోని పుష్ప ప్రాథమిక కంటి ఆసుపత్రిలో శుక్రవారం వాసవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు ప్రారంభించారు. వైద్యులు పి.కుమార్, చోడిశెట్టి లోవరాజు, దర్శి నవతేజ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కంటి శుక్లాలు ఉన్న 36 మందిని శస్త్రచికిత్స కోసం విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో 202 మందికి కంటి పరీక్షలు చేసినట్టు ట్రస్ట్ తుని శాఖ అధ్యక్షుడు కుసుమంచి సత్యనారాయణ తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, ఆవోగా అధ్యక్షుడు కడిమిశెట్టి సూర్యప్రకాష్, దాసరి నూకయ్య శెట్టి, పోలిశెట్టి వాసు, నూతిగట్టు సురేష్, కాపగంటి ప్రసాద్, బొడ్డు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలు

కాకినాడ సిటీ: ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న ఎన్‌జీవో రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మహాసభల వాల్‌పోస్టర్‌ను జగన్నాధపురంలోని అన్నవరం సత్యవతీదేవి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి సంఘం నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశానికి సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని టౌన్ ఎన్‌జీవో యూనియన్ సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శైలజాకుమారి, లలిత, ఆంజనేయులు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం


కిర్లంపూడిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఎస్పీ సత్యనారాయణ

కిర్లంపూడి: నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసినట్టు అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ పనులను జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 25న నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే స్టేషన్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ప్రారంభం నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఏఎస్సై కె.రామకృష్ణ మూర్తి, కానిస్టేబుళ్లు చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీకాంలో విద్యార్థిని ప్రతిభ


సాయివాణిని అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

తుని: స్థానిక శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో 2020–23 విద్యా సంవత్సరంలో బీకాం పూర్తి చేసిన పి.సాయివాణి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 9.04 గ్రేడు పాయింట్లతో ద్వితీయ ర్యాంక్ కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ అభినందించారు. ప్రిన్సిపల్ కె.వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో ఏపీ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎస్‌వీ చలపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ మండలశాఖ అధ్యక్షుడిగా కె.శ్రీను, ప్రధాన కార్యదర్శి కె.సుభాష్, గౌరవాధ్యక్షుడిగా శివధర్మరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటరమణ, కోశాధికారిగా ఆర్.గోపి, మహిళా కార్యదర్శిగా శ్రీలక్ష్మి, జిల్లా ప్రతినిధులుగా జి.శ్రీనివాస్, కె.పద్మజ, కార్యదర్శులుగా వెంకట సుబ్బారెడ్డి కె.కృష్ణ, కె.సత్యనారాయణ, బి.నాగేశ్వరరావు, కె.అనిల్, కె.రవికుమార్, వైవీ రమణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను సంఘ రాష్ట్ర కార్యదర్శి ఓలేటి శాస్త్రి, జిల్లా ప్రధాన కారర్యదర్శి ఆచంట సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.నారాయణరావు అభినందించారు.

ఓటర్ల వెరిఫికేషన్ గడువు పెంచాలి

జగ్గంపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగాలంటే ఓటర్ల వెరిఫికేషన్ గడువును పెంచాలని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటర్ల వెరిఫికేషన్ జరగాలని, కాకపోతే బీఎల్‌ఓలు సరిగ్గా హాజరు కావడం లేదన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా జరగటలేదని విమర్శించారు. దీనిపై జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టి సారించి వెరిఫికేషన్ సజావుగా సాగేలా చూడాలని కోరారు.

అన్నదాతల ఆర్థికాభివృద్ధికి కృషి

ఏలేశ్వరం: రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ జ్యోతి అధ్యక్షతన మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి, ఏలూరు గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.